


పొద్దు గుంకుతున్న వేళ ఒక మనిషి కొండ దిగువ చదునుగా ఉన్న బండ మీద చతికిలబడి, "కాళ్ళరిగేలా వూరంతా తిరిగాను. ఎక్కడా దొరకలేదు. ఎక్కడుందో ఆ మండేవాడికే తెలియాలి..." అంటూ వాపోయాడు.

ఈ మాటలు విన్న వెంటనే సూర్యుడు అతని ఎదుటికి వచ్చి నిలబడ్డాడు. "వెయ్యి రూపాయలు ఎక్కడుందో చెప్పాలి నీకు! అంతేకదూ?" అన్నాడు.

"అరే! ఎవరు నువ్వు?" అంటూ ఆ మనిషి ఆశ్చర్యపోయాడు.

"నేను సూర్యుణ్ణి!"

"అయితే మనిషిలాగానే ఉన్నావే?"

"నా నిజస్వరూపంతో నిలబడితే నువ్వు భగ్గున మండిపోతావు. అందుకని ఈ రూపంతో వచ్చాను..."

"చాలా సంతోషం! వెయ్యి రూపాయ లెక్కడుందో చెప్పు! అర్జెంటుగా కావాలి నాకు!"

"ఈ వూళ్ళో బ్యాంకుల నిండా ఉన్నాయి, పో!"

"బ్యాంకుల్లో ఉన్నాయి సరే—వా ళ్ళివ్వలేదు."

"అయితే ఈ వూళ్ళో షావుకా ర్లున్నారు కదా—వాళ్ళ ఇనప్పెట్టెల్లో ఉన్నాయి. వెళ్ళు!"

మనిషి విసుక్కున్నాడు. "ఇనప్పెట్టెల్లో ఉంటే వాళ్ళు ఇవ్వద్దా? అందర్నీ అడిగాను. అందరూ లేదన్నారు. ఈమాత్రం చెప్పటానికి నువ్వు కావాలా?"

"మరి, వెయ్యి రూపాయ లెక్కడుందంటే ఉన్న చోటు చెప్పాను."

"వెయ్యి రూపాయ లెక్కడుందో నాకూ తెలుసు. నాకు వెయ్యి రూపాయలు కావాలి! దొరికే చోటు చెప్పు. ఎవర్నడిగితే ఇస్తారు?"

"ఎవ్వరూ ఇవ్వరు."

"ఇవ్వరా?"

"ఊహూ!"

మనిషి మొహం వాలిపోయింది.

సూర్యుడు కాసేపు ఆలోచించి ఇలా అన్నాడు: "న్యాయంగా ఇవ్వాల్సివస్తే ఒక్కరుమాత్రం ఇవ్వాలి!"

"ఎవరు? ఎవరో చెప్పు!" అంటూ ఎగిరి గంతువేశాడు మనిషి.

"జిల్లా ఆరోగ్యశాఖ!"

"నిజంగానా? ఎందు కిస్తారు?"

"మశూచిని తెలిపిన వారికి వెయ్యి రూపాయలు ఇవ్వబడును అని వాళ్ళు ప్రకటించారు."

"మశూచి ఉందని చెబితేకదా ఇస్తారు?"

"ఉందని చెప్పు!"

"ఎక్కడుంది?"

"రోడ్డుమీదున్న మైలురాళ్ళు, కాషన్ బోర్డులు, రోడ్డు వారల్లో ఉన్న పాఠశాల గోడలు మశూచితో అసహ్యంగా తయారైనాయి. వాటి ముఖం నిండా స్ఫోటకపు మచ్చలే!"

"ఇక్కడికి దగ్గరగా ఎక్కడుంది మశూచి?"

"అదిగో, అక్కడ రోడ్డు కనిపిస్తూ ఉంది కదా? ఆ రోడ్డు వెంబడి ఎటు వెళ్ళినా సరే! అటు వెళ్ళావంటే ఒక హైస్కూలు వస్తుంది. ఇటు వెళ్ళావంటే మరొక హైస్కూలు వస్తుంది..."

"సరే, కళ్ళారా చూచి మరీ అడుగుతాను వెయ్యి రూపాయలు! నీ మేలు ఎప్పటికీ మరిచిపోను" అంటూ పరుగందుకున్నాడు మనిషి.

అతను వెళ్ళిపోయాక, ఈ సంభాషణంతా విన్న కొండ, "గోడలంటావు, మశూచి అంటావు—నీ మాటలు నాకేమీ అర్థం కాలేదు" అంది సూర్యుడితో.

"ఇందులో అర్థం కాకపోవడాని కేముంది? రహదారి పొడుగునా రోడ్డు గుర్తులమీద, గోడలమీద మశూచిని తెలిపినవారికి వెయ్యి రూపాయలు ఇవ్వబడును అని రాశారు నీలిమందుతో. ఆ మనిషికి చెప్పాను చూడు—రెండు స్కూళ్ళు—వాటి ముఖానకూడా గుమ్మడికాయ.ంత అక్షరాలు. శుభ్రంగా ఉన్న గోడలమీద వికారంగా ఆ అక్షరాలు పులిమాక ఎలా ఉందో తెలుసా? పెద్దమ్మ వారొచ్చిన ముఖాల్లాగానే ఉన్నాయి."

"ఏమిటేమిటీ!" అంటూ ముక్కున వేలేసుకొంది కొండ. "రేడియోలలో చెప్పవచ్చు గదా? పత్రికల్లో ప్రకటించవచ్చు గదా? వాల్ పోస్టర్లు అచ్చు వేయించి అంటించవచ్చుకదా? వూరూరా దండోరా వేయించవచ్చుగదా? అన్ని మార్గాలున్నప్పుడు బాధ్యత తెలిసిన ఒక శాఖ ఇలాంటి పని చెయ్యడం ఏం బాగుంటుంది? ఒక ప్రత్యేక ప్రయోజనంకోసం ఉద్దేశించిన రోడ్డు గుర్తుల్నీ, శుభ్రంగా ఉన్న బడి గోడల్నీ ఇలా ఖరాబు చెయ్యవలసిన అవసర మేమొచ్చింది?"

"ఎవరి అవసరాలు వాళ్ళవి! నువ్వు ఆలోచించినంత ఆరోగ్యవంతంగా వాళ్ళూ ఆలోచించాలని రూలా?"

"పోనీ, మన కెందుకులే ఆ గొడవలు! అయితే ఆ మనిషికి వెయ్యి రూపాయలూ ఇస్తారంటావా?" అని అడిగింది కొండ.

"న్యాయంగా అయితే ఇవ్వక తప్పదు!" అంటూ కొండ దాటుకున్నాడు సూర్యుడు.

—కలువకొలను సదానంద